సాక్షి
నంద్యాల
శనివారం । 26 । ఏప్రిల్ । 2025



నందీశ్వరుడికి అభిషేకం

మహానంది: మహానందీశ్వరుడి గర్భాలయం ఎదురుగా ఉన్న నందీశ్వర స్వామికి శుక్రవారం అభిషేకం నిర్వహించారు. అర్చకులు నాగేశ్వర శర్మ, సుబ్బయ్యశర్మ పూజలు చేపట్టారు.



తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని..

తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని మోసానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రూ.45.91 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

10లో▸



చాంపియన్ కర్నూలు బెటాలియన్

రేంజ్–2 స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ శుక్రవారం ముగిసింది. కర్నూలు బెటాలియన్‌కు చెందిన క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌ను కైవసం చేసుకున్నారు.

10లో▸

న్యూస్‌రీల్

1,006 పింఛన్ల తొలగింపు

- మే నెల పింఛన్లకు రూ.195.9 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ కింద మే నెలకు ఉమ్మడి జిల్లాలో 4,51,886 పింఛన్లకు రూ.195.9 కోట్లు మంజూరయ్యాయి. ఏప్రిల్ నెలతో పోలిస్తే మే నెలలో 1,006 పింఛన్లను తొలగించారు. చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతినెలా గుట్టు చప్పుడు కాకుండా పింఛన్లలో కోత విధిస్తున్న విషయం తెలిసిందే. మే 1న ఉదయం 7 గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

ఆర్‌యూ సీడీసీ డీన్ రాజీనామా?

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్‌గా విధులు నిర్వహిస్తున్న వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిసింది. రాజీనామా పత్రాన్ని వర్సిటీ రిజిస్ట్రార్‌కు అందజేసినట్లు సమాచారం. వ్యక్తిగత కారణాలతోనే ఆయన ఈ నిర్ణయం తెలుసుకున్నట్లు తెలిసింది.

కొనసాగుతున్న వడగాల్పులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రత కొనసాగుతోంది. రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం గమనార్హం. కరువు కాటకాలు, దుర్భిక్ష పరిస్థితులతో పాటు గాలిలో తేమ అతి తక్కువగా ఉండటం, కాలుష్యం ప్రభావమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. నంద్యాల, ఉయ్యాలవాడల్లో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహానందిలో 42.5, సంజామల, రుద్రవరం, కోడుమూరుల్లో 42.4, ఆళ్లగడ్డలో 42.2, కోవెలకుంట్లలో 42.1.కర్నూలులో 42 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ అథారిటీ డీపీఎం అనుపమ తెలిపారు.

బేరం పెట్టి అమ్మేశారు!

- నంద్యాల లిక్కర్ డిపోలో హమాలీల నియామకం
- 36 మందిని కొత్తగా తీసుకున్న వైనం
- బేరం పెట్టిన మంత్రి అనుచరులు
- ఒక్కొక్కరి నుంచి రూ. 3 లక్షల చొప్పున వసూలు?
- ఇంటర్వ్యూ చేయకుండా జాబితాను ఓకే చేసిన అధికారులు

పనికి వెళ్లే కూలీల శ్రమను దోచుకునే వాళ్లను అందరూ చూసింటారు. పని కోసం దరఖాస్తు చేసుకునే కూలీలను దోచుకున్న తమ్ముళ్ల కథ ఇది. ఎక్కడైనా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీలో అక్రమాలు, వసూళ్లకు పాల్పడటం జరుగుతుంది. ఇక్కడ మాత్రం రెక్కల కష్టాన్ని నమ్ముకునే హమాలీలను కూడా వదలలేదు. హమాలీ పని కావాలంటే అడిగినంత ఇవ్వాల్సిందేనని బహిరంగ బేరం పెట్టి అధికారుల సాక్షిగా అమ్మేశారు.



నంద్యాల ఐఎంఎఫ్‌ఎల్ డిపో వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

సాక్షి, నంద్యాల: కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకుల అక్రమార్జనకు అంతేలేకుండా పోతుంది. ఇసుక, మద్యం, మట్టి అక్రమ రవాణా చేస్తూ అందిన కాడికి దోచుకుంటున్న టీడీపీ నేతల కన్ను తాజాగా హమాలీలపైన పడింది. తమకు ముడుపులు అందజేస్తే హమాలీగా ఇప్పిస్తామని బేరాలకు దిగారు. అక్రమార్జన వెనుక న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తనయుడు ఎన్ఎండీ ఫిరోజ్ ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కమిటీ లిమిటెడ్, ఐఎంఎఫ్ఎల్ డిపోలో లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు 36 మంది హమాలీల కోసం ఈ ఏడాది మార్చి 5న ప్రకటన విడుదల అయ్యింది. రాయడం, చదవడం వచ్చిన వారు అర్హులు. నంద్యాల, పరిసర ప్రాంతాల వారిని తీసుకోవాల్సి ఉంది. మొత్తం 127 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇదే అదునుగా మంత్రి ఫరూక్ తనయుడు ఎన్ఎండీ ఫిరోజ్ అనుచరులు రంగంలోకి దిగారు. తాము చెప్పిన మొత్తం ఇస్తే వారినే ఎంపిక చేస్తామని హామీ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా, డీఆర్‌ఓ, డీఎంహెచ్‌ఓ, డీఎస్పీ, లేబర్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సభ్యులుగా ఉన్న కమిటీ నియామకాలను చేపట్టాల్సి ఉంది. అయితే రంగంలోకి దిగిన ఫిరోజ్ అనుచరులు హమాలీకి రూ.3 లక్షలు ఇవ్వాలని బేరం పెట్టారు. తమకు డబ్బులు ఇచ్చిన వారినే ఎంపిక చేస్తామని ఖరాకండిగా తేల్చి చెప్పారు. దీంతో కొంత మంది అప్పులు తెచ్చి డబ్బులు అందజేశారు.

రూ.1.10 కోట్లు వసూలు..

ఐఎంఎఫ్ఎల్ మద్యం డిపో ఉన్న ప్రాంతానికి సమీప ప్రాంతాల వారినే హమాలీలుగా తీసుకోవాల్సి ఉంది. కాని అధికారులు నిబంధనలు పక్కనబెట్టి మరీ అక్రమార్కులకు తలుపులు తెరిచారు. ఆళ్లగడ్డ, రుద్రవరం, బనగానపల్లె, కల్లూరు, బండిఆత్మకూరులో నివాసం ఉండేవారిని సైతం ఎంపిక చేశారు. ఇలా 36 మంది నుంచి సుమారు రూ.1.10 కోట్లు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఐఎంఎఫ్ఎల్ ప్రస్తుతం 24 మంది హమాలీలు పని చేస్తున్నారు. లిక్కర్ కంపెనీ నుంచి వచ్చే సరుకును వీరు అన్‌లోడింగ్ చేసి గోడౌన్‌లో భద్రపరచాలి. ఇవే బాక్స్‌లను వైన్స్, బార్ దుకాణాలకు వచ్చే వాహనాల్లో లోడ్ చేయాలి. ఒక్కో బాక్స్ అన్‌లోడ్ చేసినందుకు రూ.7, అప్‌లోడ్ చేసినందుకు బాక్స్‌కు రూ.8 చొప్పున కూలీ అందుతుంది. ఇలా ఒక్కొక్కరు పని ఉన్న రోజు నాలుగైదు వేల రూపాయలు సంపాదిస్తున్నట్లు సమాచారం. ఈ మొత్తాన్ని చూపి నూతనంగా తీసుకునే హమాలీల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జేసీ లేకున్నా జాబితాను ఓకే చేసిన డీఆర్‌ఓ..

జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ అర్హులైన వారిని ఎంపిక చేయాల్సి ఉంది. ఐదుగురు సభ్యులున్న కమిటీ ఏప్రిల్ 7న అర్హుల జాబితాను సిద్ధం చేసింది. ఈ జాబితాను పరిశీలించి జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. అయితే జేసీ సెలవుల్లో ఉండటంతో ఇన్‌చార్జి జేసీగా వ్యవహరిస్తున్న డీఆర్‌ఓ రామునాయక్ ఈనెల 17న జాబితాకు ఆమోద ముద్ర వేశారు. ఎవరైతే డబ్బులు ఇచ్చారో వారి పేర్లే తుది జాబితాలో ఉన్నాయని, మిగిలిన వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిని కనీసం ఇంటర్వ్యూ చేయకుండానే మంత్రి తనయుడు నుంచి వచ్చిన జాబితానే ఫైనల్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి..



హమాలీలను తీసుకోవడంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. రోజూ కూలీ చేసుకునే వారి నుంచి అధికార పార్టీ నాయకులు రూ.3 లక్షల చొప్పున వసూలు చేశారు. ఎలాంటి ప్రాతిపదికన లేకుండా 36 మందిని ఎలా ఎంపిక చేస్తారు? మంత్రి తనయుడు ఫిరోజ్ అందజేసిన జాబితానే అధికారులు ఆమోదించారు. అక్రమార్జనలో అధికారులకు వాటాలు అందినట్లు తెలుస్తోంది. డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకొని పారదర్శకంగా హమాలీలను ఎంపిక చేయాలి.

– నాగరాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, నంద్యాల



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

యుద్ధానికైనా సిద్ధం

కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదుల హత్యాకాండను నిరసిస్తూ శుక్రవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిరసనలు తెలిపారు. ఆదోని పట్టణంలో బంద్ పాటించారు. వ్యాపారులు దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. కర్నూలు కలెక్టరేట్ వద్ద మాజీ సైనికులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. యుద్ధానికైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కర్నూలు శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆత్మకూరులో కొత్తపేట మసీదు నుంచి ముస్లింలు గౌడ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.



కర్నూలులో ఉగ్రవాది దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం



ఆదోనిలో మూసివేసిన దుకాణాలు

విపత్తు నిర్వహణ ప్రణాళికకు నివేదికలు ఇవ్వండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కలిగే నష్టాలను నివారించడానికి వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేసేందుకు నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక – నివారణ ముందస్తు జాగ్రత్త చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 54 గ్రామాల రహదారులకు అనుసంధానమై ఉన్న 21 వాగుల పటిష్టతకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సార్‌బీసీ, తెలుగుగంగ, కేసీ కెనాల్ తదితర సాగునీటి కాలువలపై సరైన ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు. వాగుల బండ్ పటిష్టతపై ఇరిగేషన్ అధికారులు నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని 80 ఆటోమేటెడ్ వాతావరణ కేంద్రాలపై ఎప్పటికప్పుడు తనిఖీ చేసి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సీపీఓను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 27,203 మట్టి ఇళ్లు ఉన్నాయని వర్షాల వల్ల కూలిపోయే ప్రమాదం ఉంటుందని, అందులో ఎక్కువ శాతం బనగానపల్లెలో 6 వేల వరకు మట్టి ఇళ్లు ఉన్నాయని, అందులో ఉన్న వారికి అర్హత మేరకు ఇళ్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని మోసం

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- రూ.45.91 లక్షల నగదు స్వాధీనం

కర్నూలు: తక్కువ ధరకు బంగారం ఇప్పించి రెట్టింపు ధరకు అమ్మి పెడతానని చెప్పి మోసానికి పాల్పడిన రంగు నగేష్ అలియాస్ నాగిరెడ్డిని పోలీసులు పక్కా ఆధారాలతో అరెస్టు చేసి కటకటాలకు పంపారు. తెలంగాణ రాష్ట్రం కేవీ రంగారెడ్డి జిల్లా విజయ నగర్ కాలనీ హయత్ నగర్‌లో రంగు నగేష్ నివాసం ఉండేవారు. హైదరాబాదు సరూర్ నగర్‌లో నివాసముంటున్న సంతోషి మాతకు మాయ మాటలు చెప్పారు. తక్కువ ధరకు బంగారం ఇప్పించి రెట్టింపు లాభం వచ్చేలా చేస్తానని నమ్మబలికి మోసం చేశాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పక్కా ఆధారాలతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా శుక్రవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి డీఎస్పీ వివరాలు వెల్లడించారు. రూ.60 లక్షలు డబ్బులిస్తే కేజీ బంగారం కొని రూ.30 లక్షలు లాభంతో రూ.90 లక్షలకు అమ్మిస్తానని రంగు నగేష్ నమ్మించాడు. వచ్చిన లాభంలో తనకు కొద్దిపాటి సొమ్ము ఇస్తే చాలని చెప్పాడు. దీంతో సంతోషి మాత భర్త శ్రీశైలంతో కలసి కొన్ని రోజుల క్రితం సొంత ఇంటిని అమ్మగా వచ్చిన మొత్తం డబ్బులు రూ.46 లక్షలు తీసుకున్నారు. ఈనెల 19వ తేదీన ఉదయం హైదరాబాద్ నుంచి కారులో రంగు నగేష్ కలసి కర్నూలుకు వచ్చారు. కర్నూలులోని సాయిబాబా గుడి దగ్గర వారిని దించేసి బంగారు కొనేటప్పుడు వేరే వ్యక్తులు ఉండకూడదని నమ్మించి రంగు నగేష్ కారులో కర్నూలు బస్టాండ్ చేరుకున్నాడు. అక్కడ డ్రైవర్‌కు బాడుగ డబ్బులు ఇచ్చేసి హైదరాబాద్‌కు ఉడాయించాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు సంతోషి మాత దంపతులు గ్రహించి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడు హైదరాబాదులో ఉన్నట్లు గుర్తించి పక్కా ఆధారాలతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.45.91 లక్షలు నగదు స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ బాబుప్రసాద్ తెలిపారు. సీఐలు నాగరాజ రావు, శేషయ్యతో పాటు క్రైం పార్టీ పోలీసులు సమావేశంలో పాల్గొన్నారు.


నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

క్లుప్తంగా

ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ చిన్ని కృష్ణ శుక్రవారం గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చిన్ని కృష్ణ గత కొంత కాలంగా బాలాజీ కాంప్లెక్స్‌లోని ఓ అద్దె ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక చిన్నచెరువు సమీపంలో గడ్డిమందు సేవించి అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు గమనించి నంద్యాల జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆత్మహత్యకు కుటుంబ కలహాల లేక మరేదైన కారణమా? అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

పొగాకు దగ్ధం

- రూ.10 లక్షల ఆస్తి నష్టం

పాములపాడు: ఇస్కాల గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు పొగాకు పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన గుర్రం వెంకటేశ్వర్లు 30 క్వింటాళ్లు, సోమేశ్వరుడు 10 క్వింటాళ్లు, రాము 10 క్వింటాళ్లు, బన్నూరు శివ 10 క్వింటాళ్ల చొప్పున పొగాకు పంటను తోరణాలు కూర్చి ఆరు బయట ప్రాంతంలో ఆరబెట్టారు. కాగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో 60 క్వింటాళ్ల పొగాకు పంట దిగుబడి అగ్నికి ఆహుతి అయ్యింది. గమనించిన రైతులు వ్యవసాయ బావిలో నుంచి మోటార్ల ద్వారా నీటిని చల్లినప్పటికీ పంటను కాపాడుకోలేకపోయారు. ప్రస్తుతం దిగుబడులు అంతంత మాత్రమే ఉండడం గిట్టుబాటు ధర లేకపోవడం రైతులను కృంగదీస్తుంది. ఇలాంటి తరుణంలో ఈ విపత్తుతో సుమారు పది లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించిందని రైతన్న లబోదిబోమని వాపోతున్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి బాధిత రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

గుండెపోటుతో గర్భిణి మృతి


మృతి చెందిన అంకమ్మ (ఫైల్)

ఆత్మకూరు: కొట్టాల చెరువు గ్రామానికి చెందిన గర్భిణి కుడుముల అంకమ్మ(40) గుండెపోటుతో మృతి చెందింది. బైర్లూటి సాంఘిక సంక్షేమ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో కమాటీగా పని చేస్తున్న అంకమ్మ పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో సొంతూరు కొట్టాల చెరువుకు చేరుకుంది. ప్రస్తుతం ఆమె తొమ్మిదో నెల గర్భిణి. కాగా శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కుటుంబీకులు ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త వలి, కుమారుడు దరగయ్య, కుమార్తె ధరణి ఉన్నారు. అంకమ్మ మృతి విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే స్పందించి మట్టి ఖర్చులకు రూ.25 వేలు అందించారు. అంకమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు జవహర్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

పోలీసు బదిలీలకు నేడు కౌన్సెలింగ్

కర్నూలు: పోలీసు శాఖలో ఒకే చోట ఐదేళ్లు పనిచేసిన వారికి స్థానచలనం కలగనుంది. కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్‌ఐ స్థాయి సిబ్బంది ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన వారికి బదిలీ అయ్యే అవకాశముంది. సిబ్బంది బదిలీ కోసం శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 12 మంది ఏఎస్‌ఐలు, 24 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 118 మంది కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 154 మందికి బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సిందిగా బదిలీ జాబితాలో పేర్లున్న వారికి డీపీఓ నుంచి ఆదేశాలు వెళ్లాయి.

బాధితుడికి 'పది'వేల న్యాయం

- శాశ్వత లోక్ అదాలత్ తీర్పు

కర్నూలు(సెంట్రల్): ఇంటి ముందు ఉన్న డ్రెయినేజీని ఏడాదిగా శుభ్రం చేయాలని ఓ బాధితుడు కోరినా పట్టించుకోని నేపథ్యంలో కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్‌కు శాశ్వత లోక్ అదాలత్ దిమ్మ తిరిగే షాక్ ఇచ్చింది. నెల రోజుల్లో బాధితుడు ఇంటి ముందు ఉన్న కాలువను శుభ్రం చేయడంతోపాటు ఏడాదిపాటు అతడు పడిన మానసిక వేదన, పర్యావసనాలకు రూ.10 వేలు చెల్లించాలని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్, సభ్యులు టి.శివశంకర్ రెడ్డి, డి.రాజాబాబుల ఆధ్వర్యంలోని బెంచ్ శుక్రవారం తీర్పు చెప్పింది. కల్లూరు మండలం పందిపాడుకు చెందిన జి.శ్రీరాములు తన ఇంటి ముందు ఉన్న కాలువను శుభ్రం చేయాలని పదే పదే మునిసిపల్ అధికారులను కోరారు. మూడుసార్లు కలెక్టర్ అధ్యక్షతన జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. బాధితుడికి న్యాయం చేస్తూ శాశ్వత లోక్ అదాలత్ తీర్పు చెప్పింది.

వైఎస్సార్‌సీపీలో జిల్లా వాసులకు ప్రచార, గ్రీవెన్స్ బాధ్యతలు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో పలువురికి చోటు లభించింది. వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ముగ్గురికి ప్రచార విభాగంలో, మరో ముగ్గురికి గ్రీవెన్స్ సెల్ విభాగంలో బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం రాత్రి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	హోదా
కర్నాటి పుల్లారెడ్డి	ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
కె. జనార్దన్ నాయుడు	ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి
కె. వెంకటేశ్వర రెడ్డి	ప్రచార విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి
జి. రామచంద్ర రెడ్డి	గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి
జి. మల్లికార్జున రెడ్డి	గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి
జి. హరహరినాథ రెడ్డి	గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

సార్.. కందులు కొనుగోలు చేయడం లేదు

- జాయింట్ కలెక్టర్‌కు సమస్యల వెల్లువ


జేసీకి సమస్యలు విన్నవిస్తున్న రైతులు

కొత్తపల్లి: 'కందుల కొనుగోలు నిర్వాహకుల నిర్లక్ష్యంతో దిగుబడిని అమ్ముకోలేక పోతున్నాం. రోజులు తరబడి నిరీక్షిస్తున్నా పట్టించుకోవడం లేదు' అని రైతులు జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌కు మొర పెట్టుకున్నారు. దుద్యాల గ్రామంలోని కందుల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కేంద్రం వద్ద కందుల నాణ్యత, రైతుల ఆన్‌లైన్ వివరాల నమోదు, తుకాలు, క్యూఆర్ కోడ్ ట్యాగ్ పనితీరు, కందుల నాణ్యతను కొలిచే యంత్రం పనితీరులను క్షుణ్ణంగా పరిశీలించారు. జేసీ వచ్చారనే సమాచారం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకుని తమ సమస్యలు విన్నవించారు.

- ఎకరాకు ఐదు క్వింటాల కందులు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, పండించిన మొత్తం కందులను కొనుగోలు చేయాలని కోరారు.
- 20 రోజులైనా తన కందులను తీసుకోవడం లేదని రైతు నాగేశ్వరరావు జేసీకి మొరపెట్టుకున్నారు. అధికారులను అడిగితే తిప్పుకుంటున్నారన్నారు.
- ఈనెల 20వ తేదీతో కొనుగోలు గడువు ముగిసిందని సమయం పెంచి న్యాయం చేయాలన్నారు.
- నేషనల్ హైవే రహదారి నిర్మాణానికి మామిడి తోటలో ఉన్న సుమారు 22 మామిడి చెట్లు పోయాయని ఇంతవరకు పరిహారం అందలేదని ఓ మహిళ రైతు జేసీకి విన్నవించింది.
- కల్లాలకు ఆన్‌లైన్ సమస్య పరిష్కారం కావడం లేదని, పూర్వపు ఆస్తులు అమ్ముకునేందుకు పేర్లులేక ఇబ్బంది పడుతున్నామని రైతులు తెలిపారు.
- అనంతరం జేసీ మాట్లాడుతూ.. స్థానిక రెవెన్యూ అధికారులతో రైతుల సమస్యకు సమాధానం చెప్పాలని సమస్య ఏ స్థాయిలో ఉందో వెంటనే నాకు సమాచారం కావాలని రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీ వెంట ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ దాసరి మేరీ, ఎంపీపీ కుసుమలత, సర్పంచ్ శోభలత, మండల వ్యవసాయ అధికారి మహేష్ పాల్గొన్నారు.

మా వాడే... మెడికల్ సర్టిఫికెట్ ఇవ్వండి!

- వైద్యులపై ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు

కర్నూలు(హాస్పిటల్): 'మావాడే.. చూసి మెడికల్ సర్టిఫికెట్ ఇవ్వండి' అని వైద్యులపై ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లు తెస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వస్తున్న ఇలాంటి ఫోన్‌లకు సమాధానం చెప్పలేక వైద్యులు తలలు పట్టుకుంటున్నారు. ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గత రెండు రోజులుగా మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వైద్య పరీక్షల్లో మొదటిరోజు 72 మంది, రెండోరోజైన శుక్రవారం 105 మందికి పరీక్షలు నిర్వహించి నివేదికలు ఇచ్చారు. ఇందులో ఆర్థోపెడిక్ 29, క్యాన్సర్ 23, కార్డియాలజీ 22, ఎంఆర్ 20, న్యూరో సమస్యలు 21 మందికి ఉన్నాయి. కాగా కొందరు ఉపాధ్యాయులు అక్రమ మార్గంలో మెడికల్ సర్టిఫికెట్ పొందేందుకు సతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజాప్రతినిధులను కలిసి ఆసుపత్రి అధికారులు, వైద్యులకు ఫోన్ చేయిస్తున్నారు. అయితే ఇది బదిలీలకు సంబంధించిన వ్యవహారమని, అనారోగ్య సమస్యలు ఏమీ లేకుండా సర్టిఫికెట్ ఇస్తే భవిష్యత్‌లో వారికి గిట్టని వారు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని వైద్యులు భావిస్తున్నారు. తమ ఉద్యోగానికి ముప్పుగా మారుతుందని భావించి వైద్యులు ఆరోగ్య పరిస్థితి ఎలాగుంటే దాని ఆధారంగానే సర్టిఫికెట్ ఇచ్చి పంపిస్తున్నారు.

వసంతోత్సవాల్లో విదేశీయులు



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, తీర్థప్రసాదాల స్వీకరిస్తున్న విదేశీ భక్తులు

ఆళ్లగడ్డ: శ్రీ అహోబిల లక్ష్మీనరసింహ స్వామి వసంతోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. విదేశాలకు చెందిన హరేరామ హరేకృష్ణ భక్తులు ఉత్సవ పూజల్లో పాల్గొన్నారు. చైత్ర కృష్ణఏకాదశి నుంచి మూడు రోజులపాటు స్వామికి వసంతోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. రెండో రోజైన శుక్రవారం ఉదయం దిగువ అహోబిలంలో వసంత మంటపంలో ఉత్సవ మూర్తులైన శ్రీ ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారిని కొలువుంచారు. తిరుమంజనం, అర్చన, పంచామృతాభిషేకం పూజలు నిర్వహించారు.

పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును పొడిగించారు. 'ఆర్‌యూలో నిత్యం సమస్యల 'పరీక్ష'' శీర్షికతో సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి వర్సిటీ అధికారులు స్పందించారు. ఈనెల 25వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు గడువును విధించగా 24వ తేదీ వరకు ఫీజు చెల్లింపుకు ఎస్ఆర్‌లో విద్యార్థుల పేర్లు రాలేదు. దీంతో ఈనెల 28వ తేదీ వరకు ఎలాంటి ఫైన్ లేకుండా ఫీజు చెల్లించేందుకు గడువును పొడిగించారు. రూ. 100 ఫైన్‌తో 29వ తేదీ, రూ.200 ఫైన్‌తో 30వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. ఈనెల 24వ తేదీ కర్నూలు, ఆదోనిలోని పరీక్ష కేంద్రాల్లో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ పట్టు బడటంతో సంబంధిత పరీక్ష కేంద్రాల సీఎస్, అబ్జర్వర్, ఇన్విజిలేటర్‌లకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లును వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. వెంకట బసవ రావు ఆదేశించారు.

ఎంపీడీఓలుగా పది మందికి పదోన్నతి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న పరిపాలన అధికారులు, డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ పీఆర్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ కృష్ణతేజ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే ఎంపీడీఓలుగా పదోన్నతి పొందిన వారిని వివిధ జిల్లాలకు కూడా కేటాయించారు.

పదోన్నతి పొందిన ఎంపీడీఓలు

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న కేడర్	పదోన్నతిపై బదిలీ అయిన జిల్లా
బి.వి.రమణ రావు	ఏఓ, డ్వామా, కర్నూలు	కర్నూలు
ఆర్.పార్థసారథి	ఏఓ, ఎంపీపీ, ఉయ్యాలవాడ	శ్రీసత్యసాయి
జి.కరుణ సాగర్	ఏఓ, ఎంపీపీ, కొత్తపల్లి	శ్రీసత్యసాయి
బి.నూర్జహా	ఏఓ, ఎంపీపీ, జూపాడుబంగ్లా	కర్నూలు
కె.విజయశేఖర్ రావు	ఏఓ, ఎంపీపీ, ఆదోని	కర్నూలు
వి.విజయసింహా రెడ్డి	ఏఓ, ఎంపీపీ, గూడూరు	అనంతపురం
ఎం.బాలకృష్ణుడు	డిప్యూటీ ఎంపీడీఓ, ఎంపీపీ, ప్యాపిలి	శ్రీసత్యసాయి
ఎం.సూర్యనారాయణ	డిప్యూటీ ఎంపీడీఓ, ఎంపీపీ, దేవనకొండ	అనంతపురం
జి.ప్రభావతి దేవి	డిప్యూటీ ఎంపీడీఓ, ఎంపీపీ, మంత్రాలయం	కర్నూలు
ఎ.మద్దిలేటి స్వామి	డిప్యూటీ ఎంపీడీఓ, ఎంపీపీ, మద్దికెర	కర్నూలు

కేడీసీసీ బ్యాంకులో పిటిషన్ల గోల!

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా పిటిషన్‌ల పర్వం సాగుతోంది. తమ లక్ష్యాలకు అడ్డం పడుతున్నారనే అనుమానం ఉన్న అధికారులకు పిటిషన్‌ల ద్వారా చుక్కలు చూపుతున్నారు. ఇటీవల కాలంలో బ్యాంకులో పనిచేస్తున్న సీనియర్ అధికారుల పేరుతోనే పిటిషన్‌లు నేరుగా ఆప్కాబ్‌కు వెళ్తున్నట్లు తెలుస్తోంది. 10 నెలల కాలంలో దాదాపు 100 వరకు ఇలాంటి పిటిషన్‌లు వెళ్లినట్లు సమాచారం. బ్యాంకుకు కొత్త సీఈఓ వస్తున్నారంటే చాలు ఆయన క్యారెక్టర్‌ను దెబ్బతీసే విధంగా పిటిషన్‌లు వెళ్తుండటం గమనార్హం. పిటిషన్‌లు మంచి భాషతో పెడితే ఎవ్వరికీ ఇబ్బంది ఉండదు కానీ, కుటుంబ సభ్యులను దారుణంగా కించపరుస్తూ బూతులతో నింపేస్తుండటం అధికారుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. ఈ వ్యవహారంపై బ్యాంకు అధికారులు కొద్ది నెలల క్రితమే పోలీసులకు పిర్యాదు చేశారు. అయినప్పటికీ వీటి వెనుక ఎవరున్నారనే విషయాన్ని గుర్తించలేకపోవడంతో మరింత రెచ్చిపోతున్నట్లు చర్చ జరుగుతోంది.

మహిళల జీవనోపాధికి రుణాలు

- డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి



కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల్లోని మహిళల జీవనోపాధిని అభివృద్ధికి చేసేందుకు రుణాలు ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వైపీ రమణారెడ్డి తెలిపారు. ఇందుకోసం 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,898.15 కోట్లతో రుణ ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో 954 గ్రామైక్య సంఘాలు, 25 మండల సమాఖ్యలు ఉన్నాయన్నారు. మొత్తం 32,572 ఎస్‌హెచ్‌జీలు ఉండగా.,. ఇందులో 3,30,044 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి తదితర వాటి కింద రుణ సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

'ఉపాధి' నిధులతో పండ్లతోటల అభివృద్ధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పండ్లతోటలను అభివృద్ధి చేసుకోవచ్చని డ్వామా పీడీ వెంకటరమణయ్య తెలిపారు. ఇందుకు అర్హులైన రైతులను గుర్తించాలన్నారు. కలెక్టరేట్‌లోని డ్వామా సమావేశ మందిరంలో సాంకేతిక సహాయకులకు ఈ నెల 17 నుంచి నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో డ్వామా పీడీ మాట్లాడుతూ.. 2025–26 సంవత్సరంలో 6,750 ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యమన్నారు. మొత్తంగా 17 రకాల పండ్ల తోటల సాగుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అదనపు పీడీ మాధవీలత, ఏపీడీలు పాల్గొన్నారు.

3,075 స్పౌజ్ పింఛన్లు మంజూరు

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కింద 3,075 మంది వితంతు మహిళలకు పింఛన్లు మంజూరయ్యాయి. 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్యకాలంలో వృద్ధాప్య పింఛను తీసుకుంటూ మరణించిన వారి భార్యలకు వితంతు పింఛన్లు మంజూరు చేసింది. ఈ జాబితాలను ప్రభుత్వం డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌కు పంపగా.. వీటిని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు పంపారు. వితంతు పింఛను మంజూరుకు ఆయా సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు వెంటనే డెత్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలన్నారు. నంద్యాల జిల్లాకు 3,169 పింఛన్లు మంజూరయ్యాయి.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

- 28న కర్నూలులో ముస్లింల భారీ ర్యాలీ
- 30న రాత్రి ఇళ్లల్లో విద్యుత్ దీపాలు ఆర్పివేసి నిరసన
- రౌండ్ టేబుల్ సమావేశంలో ముస్లిం మత పెద్దలు



మాట్లాడుతున్న రాష్ట్ర జమాతుల్ ఉలమ్ అధ్యక్షుడు మౌలానా ముజీబ్, రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన ముస్లిం మత పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు

కర్నూలు (టౌన్): వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఉలమ్ అధ్యక్షుడు మౌలానా మజీద్ డిమాండ్ చేశారు. కర్నూలు రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని ఒక హోటల్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముస్లిం మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు హాజరయ్యారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసన తెలుపుతూ మృతులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం మౌలానా మజీద్ మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతర వ్యక్తులను నియమించడం, కలెక్టర్ పర్యవేక్షణ చేయడం వంటి విధానాలు వ్యతిరేకిస్తున్నామన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 28న కర్నూలులో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 30వ తేదీ రాత్రి 9 నుంచి 9.15 గంటల వరకు ప్రతి ఇంట్లో లైట్లను ఆర్పివేసి నిరసనను వ్యక్తం చేద్దామన్నారు.

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ... పార్లమెంట్, రాజ్యసభలో తమ పార్టీ ముస్లింలకు మద్దతుగా నిలిచిందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించిందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు అహమ్మద్ అలీఖాన్ మాట్లాడుతూ.. ముస్లింలు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. కలసికట్టుగా పోరాడుదామన్నారు. మైనార్టీలైన క్రైస్తవులు మద్దతు ఇవ్వడం సంతోషం అన్నారు.
- పాస్టర్లు షాలేమ్ రాజు, బొరెల్లి శశికుమార్ మాట్లాడుతూ.. ముస్లింలు చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తామన్నారు. సమావేశంలో ఆర్ఆర్‌డీ సజీవరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, రెవరెండ్ అబ్రోజ్, విజయ్‌కుమార్, జహీంగీర్ అహమ్మద్, హమీదు, జాకీర్ అహమ్మద్, అన్వర్ బాషా పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ కర్నూలు బెటాలియన్

- ముగిసిన ఏపీఎస్పీ రేంజ్–2 స్పోర్ట్స్ మీట్
- డీఐజీ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం


కర్నూలు రెండో బెటాలియన్ క్రీడాకారులకు ట్రోఫీని అందజేస్తున్న డీఐజీ, కమాండెంట్

కర్నూలు: ఏపీఎస్పీ రేంజ్–2 స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో కర్నూలు రెండో బెటాలియన్ క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్‌ను కై వసం చేసుకున్నారు. కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో కమాండెంట్ దీపిక పాటిల్ నేతృత్వంలో మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించారు. కర్నూలుతో పాటు కడప, అనంతపురం, చిత్తూరు స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆఫ్ సెంట్రల్ పోలీస్ లైన్ అంబర్‌పేట, హైదరాబాదు బెటాలియన్‌కు చెందిన పోలీసు క్రీడాకారులు స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నారు. బాస్కెట్‌బాల్ పోటీల్లో రెండో బెటాలియన్ మొదటి బహుమతి సాధించగా, 9వ బెటాలియన్ రన్నర్స్‌గా నిలిచారు. అలాగే కబడ్డీ పోటీల్లో రెండో బెటాలియన్ మొదటి బహుమతి సాధించగా, 9వ బెటాలియన్ క్రీడాకారులు రన్నర్స్‌గా నిలిచారు. వాలీబాల్ పోటీల్లో 14వ బెటాలియన్‌కు మొదటి బహుమతి దక్కగా రెండో బెటాలియన్ క్రీడాకారులు రన్నర్స్‌గా నిలిచారు. క్రికెట్ పోటీల్లో కూడా 14వ బెటాలియన్ మొదటి బహుమతి సాధించగా కర్నూలు రెండో బెటాలియన్ రన్నర్స్‌గా నిలిచింది. వ్యక్తిగత స్పోర్ట్స్ విభాగాల్లో జావెలిన్ త్రోలో 11వ బెటాలియన్ పీసీ ప్రదీప్ కుమార్ మొదటి బహుమతి, నరసింహ తృతీయ బహుమతి, 9వ బెటాలియన్ పీసీ గోపీనాథ్ ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. అలాగే లాంగ్‌జంప్‌లో 11వ బెటాలియన్ పీసీ ప్రదీప్ కుమార్ మొదటి బహుమతి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ద్వితీయ బహుమతి, ఎస్ఏఆర్‌సీపీఎల్ యూనిట్ పీసీ వెంకటేశ్వర్లు మూడో బహుమతి సాధించారు. 800 మీటర్ల పరుగుపందెంలో రెండో బెటాలియన్ పీసీ నరేంద్ర మొదటి బహుమతి, 9వ బెటాలియన్ పీసీ వెంకయ్య రెండో బహుమతి, పీసీ అశోక్ మూడో బహుమతి కై వసం చేసుకున్నారు. హైజంప్‌లో 11వ బెటాలియన్ పీసీ ప్రదీప్ కుమార్ మొదటి బహుమతి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, రెండో బహుమతి, ఎస్ఏఆర్‌సీపీఎల్ యూనిట్ వెంకటేశ్వర్లు మూడో బహుమతి సాధించారు. ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా రెండో బెటాలియన్ నిలిచింది.

డీఐజీ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం..

ఏపీఎస్పీ రేంజ్–2 స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి శుక్రవారం సాయంత్రం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, రెండో బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెండో బెటాలియన్ అదనపు కమాండెంట్ నాగేంద్రరావు, అసిస్టెంట్ కమాండెంట్లు మహబూబ్ బాషా, రవికిరణ్, వెంకటరమణ, సుధాకర్ రెడ్డి, రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.